## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. చెన్నూర్ సబ్‌స్టేషన్‌లోని 33/11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వండి

మందమర్రిరూరల్: కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తగు సూచనలు పాటించాలని తెలిపారు. ఇంటి సంరక్షణ కోసం ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని తెలిపారు. అలాగే ప్రజలు ఎక్కడ ఉన్నారనే విషయాన్ని తెలిసే విధంగా లోకేషన్ ట్రావెల్ ప్లాన్, వాట్సాప్ స్టేటస్ పెట్టవద్దని సూచించారు.

### ఎమ్మెల్యేను కలిసిన ఓరియంట్ కంపెనీ ప్రెసిడెంట్



పుష్పగుచ్ఛం ఇస్తున్న సత్యబ్రతశర్మ

కాసిపేట: ఓరియంట్ సిమెంట్ కంపెనీ ప్రెసిడెంట్ సత్యబ్రతశర్మ శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కాసిపేట మండల అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం చర్చించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, కార్మికులు భరతాని సతీష్, కృష్ణ ఉన్నారు.

### రక్తదానం



రక్తదానం చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

పాతమంచిర్యాల: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలక పండ్లు పంపిణీ చేశారు. బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి మధుసూధన్ రెడ్డి, చైర్మన్ భాస్కర్ రెడ్డి, సూపర్‌వైజర్ మాధవి పాల్గొన్నారు.

### కనులపండువగా కుడారై పూజలు

జైపూర్:మండల కేంద్రంలోని భూనీల సమేతా శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కుడారై కార్యక్రమం కనులపండువగా సాగింది. ధనుర్మాసం సందర్భంగా అర్చకులు కృష్ణమాచార్యుల నేతృత్వంలో పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ ప్రధానకర్త బల్మూరి ఉష-అరవీందర్‌రావు, స్థానిక సర్పంచ్ ఆసంపల్లి సువర్ణ-రాజమల్లు, ఎంపీటీసీ రామటెంకి లింగస్వామి పాల్గొన్నారు.

### సుదర్శన హోమం

చెన్నూర్: పట్టణంలోని జగన్నాథాలయంలో దేవాలయ అర్చకులు దామెర మోహనాచార్యుల నేతృత్వంలో అనిలాచార్యులు, అజయ్ అచార్యులు నృసింహ సుదర్శన హోమం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన హోమం మధ్యాహ్నం పూర్తయింది. ఆలయ ధర్మకర్తలి మండలి సభ్యులు నూక లచ్చన్న, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నడిపల్లి లక్ష్మణ్‌రావు, సురేశ్‌దేవుడాలు పాల్గొన్నారు.

### ప్రియాంకాగాంధీ జన్మదిన వేడుకలు



సంబరాల్లో నాయకులు

రామకృష్ణాపూర్: కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంకాగాంధీ 52వ జన్మదిన వేడుకలను పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు పలిగిరి కనకరాజు, గండి కుమార్, వేల్పుల మల్లేష్, రాజేందర్ పాల్గొన్నారు.

### పోషణ్ అభియాన్...

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్డు సెక్టార్‌లోని రాజీవ్‌నగర్ 1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ అభియాన్‌లో భాగంగా శ్రీమంతాలు, అన్న ప్రాసన్న కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్ రమా ఉన్నారు.

# యువతకు దిక్సూచి వివేకానంద



లక్సెట్టిపేట: :శ్రీసరస్వతి శిశుమందిర్‌లో పూలమాల వేస్తున్న సిబ్బంది



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న రాముని చెరువు వాకర్స్ సభ్యులు

స్వామి వివేకానంద 161వ జయంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలుచోట్ల వక్తలు మాట్లాడుతూ దేశ నిర్మాణానికి మూల స్తంభం లాంటి యువతరంలో స్ఫూర్తి నింపడానికి స్వామి వివేకానంద ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. బలహీనులని బావిస్తే బలహీనులుగా ఉండి పోతారని, బలమైన వారిగా బావిస్తే బలీయ శక్తులుగా ఎదుగుతారని ఆయన చెప్పిన మాటలను గుర్తు చేశారు. నిరంతర కృషితో ఉన్నతమైన శక్తులుగా ఎదగండి, డబ్బులేని వాడు పేదవాడు కాదని.. ఏ ఆశయం లేకుండా తిరిగేవాడు పేదవాడని ఉత్తేజకరమైన ప్రసంగాలు చేశారని.. నేటి యువత స్వామిజీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.



కాసిపేట: నివాళులర్పిస్తున్న సభ్యులు



చెన్నూర్: వేడుకల్లో పాల్గొన్న నాయకులు




చెన్నూర్‌రూరల్: అంగ్రాజ్‌పల్లిలో ర్యాలీ చేస్తూ..

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని స్వామి వివేకానంద విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎంఈవో కె.రాధాకృష్ణమూర్తి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ చంద్రయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, కరస్పాండెంట్ మణికంఠ ఉన్నారు.

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివేకానంద జయంతిని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రాజేందర్‌బాబు, ఏబీవీపీ నాయకురాలు మామిడి అక్షిత, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు కొండపాక చారి, శంకర్, సుధాకర్, లక్ష్మీనారాయణరెడ్డి, రాజేశ్ పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆంజనేయ ప్రసాద్, లెక్చరర్ రమేష్ పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రాముని చెరువు కట్టపైన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేసన్ సభ్యులు గజ్జెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిమల్లేశం, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు రమేష్, డాక్టర్లు మూర్తి, సల్మాన్ రాజ్, పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ కళాశాల మైదానంలో కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, సామాజిక కార్యకర్త పాటింబడ్ల శ్రీరామూర్తి, నరేష్‌చంద్‌జైన్ ఉన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌లో వేడుకలు నిర్వహించారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, నాయకులు గంగారెడ్డి, రాజ్‌కుమార్ ఉన్నారు.

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఉషారాణి, సిబ్బంది ఉన్నారు. పట్టణంలోని టీం పంచముఖి హనుమాన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కెరిమెరి మండలంలోని చింతకర్ర గ్రామంలో 100మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.

జన్నారం: జన్నారం మండల కేంద్రంలోని కరిమల జూనియర్ కళాశాలలో జరిగిన జయంతి వేడుకల్లో జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు లక్ష్మణ్, శ్రీనివాస్, సతీశ్‌గౌడ్ ఉన్నారు.



మందమర్రిరూరల్: మాలవేస్తున్న సిబ్బంది



మంచిర్యాలరూరల్(హాజీపూర్): నర్సింగాపూర్‌లో..



జన్నారం: పూలమాలలు వేస్తున్న జెడ్పీటీసీ

# యువత అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

జన్నారం: యువత అన్ని రంగాల్లో రాణించాలని, దేశ భవిష్యత్ యువకుల చేతుల్లోనే ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం జన్నారం మండలం పొనకల్‌లో పెరుగు సుధాకర్ నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆర్ట్ అండ్ క్రియేషన్ యానిమేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువకులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉపాధి మార్గాలు ఎంచుకోవాలన్నారు. ఆర్ట్ అండ్ క్రియేషన్ ఏర్పాటు చేసి ఉపాధి పొందడమే కాకుండా మరో 20మందికి ఉపాధి చూపించడం అభినందనీయమన్నారు. గత పాలకుల హయంలో నిరుద్యోగ సమస్య ఎక్కువైందన్నారు. వివిధ రంగాల్లో యువకులను ప్రోత్సాహించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, ఎంపీటీసీ రియాజోద్దీన్ పాల్గొన్నారు.

# ఓపెన్ జిమ్ పనులు తక్షణమే ప్రారంభించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వాకర్స్

కాసిపేట: సోమగూడెం సింగరేణి మైదానంలో ఓపెన్ జిమ్ పనులు తక్షణమే ప్రారంభించాలని వాకర్స్, క్రీడాకారులు శుక్రవారం పనులు ప్రారంభించిన చోట నిరసన తెలిపారు. సోమగూడెం(బి) గ్రామపంచాయతీలోని సింగరేణి మైదానంలో ఏర్పాటు కోసం ఏడాది క్రితం పనులు ప్రారంభించి వదిలి వేశారని, సోమగూడెం(బి), సోమగూడెం(కె), పెద్దనపల్లి, లంబాడితండా(కె) గ్రామపంచాయతీలకు చెందిన వాకర్స్, క్రీడకారులు, యువకులు మైదానాన్ని వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. ఇకనైనా పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వాకర్స్ సంకె రవి, రాజేందర్, శ్రీనివాస్, మహేందర్, బానేష్, రామకృష్ణ ఉన్నారు.

## ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు..



నర్సాపూర్‌లో బహుమతి అందిస్తున్న రఘునాథ్



ముగ్గులు వేస్తున్న మహిళలు

దండేపల్లి: మండల కేంద్రంతో పాటు, మండలంలోని రెబ్బనపల్లి, చింతపల్లి, నర్సాపూర్, మేదరిపేట, గుడిరేవు గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలు పలువురుని ఎంతగానో ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన వారికి నగదుతో పాటు, కన్సోలేషన్ బహుమతులు అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మహిళ నాయకురాలు స్రవంతి, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో మహిళలకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందించారు. పాఠశాల డైరెక్టర్ పొన్నాల వినయ్, జిల్లా పర్యావరణ విద్య సమన్వయాధికారి గుండేటి యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ రాజుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఆర్ఎంపీ సంతపురి రాజు నేషనల్ ప్రీమియం 2024 అవార్డు అందుకున్నట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం తెలంగాణ సరస్వత పరిషత్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉత్తమ సేవా అవార్డును ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లోని ఆడిటోరియంలో డైరెక్టర్ రవి చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో అతడిని పలువురు అభినందించారు.

# క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



సమావేశంలో కార్యకర్తలతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

పాతమంచిర్యాల: క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తామని, క్రీడలకు ఉపయోగపడే విధంగా జిల్లాలో స్టేడియం నిర్మిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శుక్రవారం కోల చందుగౌడ్, పులి యశ్వంత్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను పాతమంచిర్యాలలోని మున్సిపల్ క్రీడా మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో పార్కులతో పాటు క్రీడాకారులకు స్టేడియం నిర్మాణం చేస్తామని ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేరుస్తామన్నారు. ఈ సందర్భంగా ఓల్డ్ మంచిర్యాల స్పోర్ట్స్ క్లబ్ తూముల భీమయ్య ట్రస్ట్ సభ్యులను టోర్నమెంట్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు నరేష్, బొలిశెట్టి కిషన్, ప్రభాకర్, కౌన్సిలర్ బొలిశెట్టి సునీత, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రమేష్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యులు చంద్రశేఖర్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేష్, మాజీ కౌన్సిలర్ మల్లయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

**అయోధ్య శ్రీరాముడు బీజేపీ సొంతం కాదు..**

అయోధ్య శ్రీరాముడు బీజేపీకి సొంతం కాదని, అస్తి అంతకన్న కాదని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాముడి పేరుతో బీజేపీ ఓట్ల రాజకీయం చేయడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా బీజేపీ శ్రేణులు దేవుడి పేరుతో సెంటిమెంట్ రగిలించి ఓట్లు పొందాలనే ఆలోచనకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

**వనిత వాక్కు సేవలు అమోఘమైనవి**

మంచిర్యాలక్రైం: వనిత వాక్కు ఫౌండేషన్ నిర్వహకులు చేపట్టిన సేవ కార్యక్రమాలు అమోఘమైనవని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావ్ కొనియాడారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాస గృహంలో ఆ ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ చేయాలనే ఆలోచన కలిగి ఉండడం ఓ గొప్ప వరమన్నారు.

**క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా జడ్జి..**

వనిత వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2024 క్యాలెండర్‌ను జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు ఆవిష్కరించారు. మహిళల భద్రతే లక్ష్యంగా సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వనిత వాక్కు వ్యవస్థాపక అధ్యక్షుడు న్యాయవాది,సైకలాజిస్ట్ రంగు వేణి కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, కో- ఫౌండర్ తాళ్లపల్లి కవిత, కుర్మ సునీత, జిల్లా గౌరవ అధ్యక్షురాలు జ్యోత్స్న చంద్రదత్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంజుల, పద్మారెడ్డి, శైలజ, విజయ ఉన్నారు.

# శ్రీధర్ గ్యాస్ట్రో, ల్యాప్రోస్కోపి ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఆర్‌పి శాస్త్రీ

పాతమంచిర్యాల: మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాకు సమీపంలో శ్రీధర్ గ్యాస్ట్రో అండ్ ల్యాప్రోస్కోపి ఆస్పత్రిని శుక్రవారం కిమ్స్ ఆస్పత్రి హెచ్‌వోడీ, ప్రొఫెసర్ ఆర్‌పి శాస్త్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఫుల్ టైం గ్యాస్ట్రో అండ్ లాప్రోస్కోపి ఆస్పత్రిని మంచిర్యాలలో ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఆస్పత్రి వైద్యులు శ్రీధర్ పుల్లూరి మాట్లాడుతూ మా ఆసుపత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఎండోస్కోపీ, అడ్వాన్స్‌డ్ ల్యాప్రోస్కోపి, జనరల్ సర్జరీ, అన్ని రకాల జీర్ణశయ వ్యాధులకు సంబంధించిన వైద్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రమణ, సెక్రటరీ మూర్తి, కోశాధికారి కేఎంఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం

జైపూర్: మండలంలోని ఇందారంలో మాజీ కేంద్ర మంత్రి గడ్డం కళావతి-వెంకటస్వామి కాక స్మారకార్థం క్రికెట్ పోటీలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంభర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యూత్‌నాయకులు ఆసంపల్లి శ్రీకాంత్‌తో పాటు స్థానిక ప్రజాప్రతి నిధులతో కలిసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. విజేతగా నిలిచిన టీంకు రూ.20వేలు, రన్నరప్ టీంకు రూ.10వేలు మనీ ప్రైజ్ అందించనున్నట్లు తెలిపారు. నాయకులు గోనే నర్సయ్య, ఈగ సురేందర్, బేద మల్లేశ్, శేఖర్, జైనోద్దీన్, నదీమ్, పాత ప్రశాంత్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి..**

వేమనపల్లి: గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మయ్య సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జీపీడీపీపై సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు గాలి మధు, శ్రీనివాస్, ఎంపీఓ బాపురావు, తహశీల్దార్ సదానందం, వైద్యాధికారి రాజేష్, ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్, ఏపీవో సత్యప్రసాద్, ఉమారాణి ఉన్నారు.

**17 నుంచి గ్రామసభలు**

భీమారం: మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో ఈ నెల 17నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు తయారీ చేసేందుకు గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో సూచించారు.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలో ఈ నెల 16వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. గ్రామపంచాయతీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెన్నూర్‌రూరల్: ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనుల ఎంపిక కోసం ఆర్థిక ప్రణాళిక తయారు చేసేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.శ్రీనివాస్ తెలిపారు.

దండేపల్లి: ఈ నెల 17 నుంచి గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీవో మల్లేశం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా నిర్వహించారు. ఏవో అంజిత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, పీఆర్‌ఏఈ విక్రమ్, ట్రాన్స్‌కో ఏఈ రాయనర్సు పాల్గొన్నారు.

**కాల్వలు నిర్మించాలని వినతి**

భీమారం: మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ ద్వారా పంట పొలాలకు సాగునీరందించేందుకు కాలువలు నిర్మించాలని ఆర్కెపల్లి, భీమారం గ్రామానికి చెందిన రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కొన్నిచోట్ల కాల్వలు ఉన్నా పొలాలకు నీరందించేందుకు వీలుగా లేవన్నారు.సమీపంలోనే ప్రాజెక్ట్ ఉన్నప్పటికీ సాగు నీరు రావడం లేదని వాపోయారు.

**పతంగుల పంపిణీ**

జైపూర్: మండల కేంద్రంలో పిల్లలకు సంక్రాంతి పండుగ సందర్భంగా ఫారెస్టు డిప్యూటీ రేంజర్ సాగరిక పతంగులను పంపిణీ చేశారు. పతంగులను ఎగురవేసే చైనా మాంజాతో పక్షులు, జంతువులు, మనుషులకు ప్రమాదం కలిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, సాధారణ దారంతో పతంగులను ఎగరవేయాలని కోరారు.

**అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ..**

నెన్నెల: మండల కేంద్రంలోని భక్తాంజనేయ ఆలయంలో అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ అక్షింతలు పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో వచ్చి అక్షింతలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

**నేడు విద్యార్థులకు సైకిల్ రేస్**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట బుగ్గగట్టు హనుమాన్ విగ్రహం ఎదుట గల మైదానంలో హాజీపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో 13వ తేదీ శనివారం విద్యార్థులకు సైకిల్ రేస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ఉంటాయని, పోటీల్లో పాల్గొనే వారు శనివారం 10 గంటల్లోగా పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 99080 74636 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

**వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర**

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల, లింగంపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాల.. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాలారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏతం శివకృష్ణ, సర్పంచు అంగ లక్ష్మి, రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆలం బాపు, బీజేవైఎం మండల అధ్యక్షుడు వెంకటేశ్ ఉన్నారు.

**ప్రచార యాత్రలు..**

దండేపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని నర్సాపూర్‌లో మోదీ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు.

**ఈనెల 14న వాలీబాల్ టోర్నమెంట్..**

నెన్నెల: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని కోణంపేటలో ఈ నెల 14 నుంచి యూత్ ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తోడె బాపురెడ్డి తెలిపారు. కంకణాల వెంకన్న జ్ఞాపకార్థంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలు, రెండో స్థానంలో రూ.3,500 , మూడో స్థానంలో రూ.1500 నగదుతో పాటు షీల్డ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో ఆడాలనుకునే జట్ల పేర్లు నమోదు చేసుకోవాల్సిన వారు వివరాలకు 7780752260, 9014191258 నంబర్లను సంప్రదించాలని కోరారు.

**పనుల్లో జాప్యం లేకుండా చూడాలి**

కాసిపేట: అధికారులు గ్రామాల్లో చేపట్టి పనుల్లో జాప్యం లేకుండా చూసుకోవాలని ఏంపీడీవో ఎంఏ అలీం సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ అధికారులు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మురుగు కాలువల చెత్త తొలగింపు వీధులు శుభ్రంగా ఉండేల చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో నవీన్, ఏంపీవో నాగరాజు పాల్గొన్నారు.

**బిల్లులు చెల్లించాలని కమిషనర్‌కు వినతి**

పాతమంచిర్యాల: మున్సిపల్ పారిశుధ్య, నీటి సరఫరా ఎలక్ట్రిసిటీ విభాగాలలో పని చేస్తున్న 345 మంది కార్మికులు గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు రావాల్సిన సబ్బులు, నూనె, యూనిఫాం, రెండు జతల చెప్పులకు సంబంధించిన బిల్లులు విడుదల చేయాలని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులతో కలిసి కార్మికులు కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సుదమల్ల అశోక్ తేజ, ముఖ్య సలహదారు బానేష్, గౌరవ అధ్యక్షులు దేవీ సత్యం పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భీమిని: హైదరాబాద్‌లో ఈ నెల 29న జరిగే పోరుగర్జన సభను విజయవంతం చేయాలని బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి ఇప్ప రాజన్న కోరారు. శుక్రవారం కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్‌లో పోరుగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెప్పులు కుట్టే వృత్తిదారులకు నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని, దళితబంధు పథకాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇప్ప మల్లేష్, నగేష్, భాస్కర్ పాల్గొన్నారు.